సాక్షి జగిత్యాల

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు

కోరుట్లటౌన్: మాదాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి.



ధర్మపురిలో భక్తుల సందడి

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.0/17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అన్ని రంగాల్లో రాణించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. 'మహిళలు, యువతీయువకుల వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలకు అవకాశాలు, నవాళ్లు' అంశంపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టరేట్‌లో శనివారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, హైదరాబాద్‌కు చెందిన స్టేట్ టీ లైఫ్ ఆర్గనైజింగ్ సంస్థ ఆధ్వర్యంలో 'అవకాశాలకు సవాళ్లు' పేరిట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతీఒక్కరు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని, ఇందులో మహిళా సంఘాలు తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులు, మార్కెటింగ్ సౌకర్యం, బిజినెస్ ప్లాన్లపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈనెల 28న స్థానిక పొన్నాల గార్డెన్స్‌లో కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీ లైఫ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు తాటిపర్తి దీపికరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పొన్నాల శిరీష పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న సత్యప్రకాశ్

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఎం.సత్యప్రకాశ్‌కు 'ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ డిస్‌ప్యూట్స్ ఇన్ ఇండియా ఏ కేస్ స్టడీ ఆన్ గోదావరి రివర్' అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. ఈమేరకు రామానంద తీర్థ మరఠ్వాడా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రకటించింది. ఈ పట్టాను శనివారం అక్కడి ప్రతినిధుల చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పట్టా అందుకున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సుల్తానా, హర్‌జ్యోత్‌కౌర్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, తిరుపతి, స్వరూపరాణి, జ్యోతి, లక్ష్మీ, శ్రీనివాస్ తదితరులు సత్యప్రకాశ్‌ను అభినందించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే చోరీలు'



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొండగట్టు(చొప్పదండి): ఆలయ అధికారుల నిర్లక్ష్యంతోనే కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం దొంగతనం జరిగిందని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడిపల్లి సత్యం ఆరోపించారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆలయం ఎదుట నిరసన తెలిపారు. ఆలయంలో చోరీతో భక్తుల్లో విశ్వాసం దెబ్బతింటోందన్నారు. చోరీ జరిగి 24గంటలు గడిచినా దొంగలను పట్టుకోలేదని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఆలయానికి ప్రత్యేక భద్రతా వలయం ఏర్పాటు చేయాలని, వచ్చే హనుమాన్ జయంతి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. నాయకులు ఆదిరెడ్డి, బక్షిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో టీఎస్ ఐడబ్ల్యూడీసీ చైర్మన్



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

జగిత్యాల/మల్యాల(చొప్పదండి): రాష్ట్ర విద్యాశాఖ, సంక్షేమ, మౌలిక వసతులు, అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఐడబ్ల్యూడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి శనివారం జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలు సందర్శించారు. బడుల్లో చేపట్టిన మన ఊరు.. మన బడి కార్యక్రమ పనులు, మౌలిక వసతులమాయన ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్ మకరంద్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కుక్కలు కరుస్తున్నాయి..



- వాటిబారి నుంచి కాపాడండి
- తాగునీటి సమస్య తలెత్తింది
- బల్దియాలో పారిశుధ్యం లోపిస్తోంది
- వార్డుల్లో మరిన్ని వసతులు కల్పించండి
- 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం ద్వారా ప్రజల విన్నపం
- సత్వరమే పరిష్కరిస్తామన్న మున్సిపల్ కమిషనర్ నరేశ్

సాక్షి ఫోన్ ఇన్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో సుమారు 8వేల వరకు వీధికుక్కలున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఎవరైనా సరే.. ఎదురుగా వస్తే దాడి చేసి కరుస్తున్నాయి. వాహనదారులనూ వెంటాడుతూ కిందపడేస్తున్నాయి. ఫలితంగా తీవ్రగాయాలతో వారు ఆస్పత్రుల పాలవుతున్నారు. అలాగే పట్టణంలో పారిశుధ్యం లోపిస్తోంది. దుర్గంధం వెదజల్లుతోంది. కొన్నిచోట్ల తాగునీటి సమస్య కూడా తీవ్రరూపం దాల్చింది. ఇలాంటి సమస్యలన్నింటిపైనా మున్సిపల్ కమిషనర్ బోనగిరి నరేశ్‌తో 'సాక్షి' శనివారం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించింది. బల్దియా పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇట్లాంటి సమస్యలతోపాటు పలు మౌలిక వసతుల కల్పన గురించి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటన్నింటినీ ఓపికతో విన్న నరేశ్.. సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ప్రజలకు మరిన్ని వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు, కమిషనర్ సమాధానాలు వారి మాటల్లోనే..

చిన్నారులేకాదు పెద్దలపైనా కుక్కలు దాడులు చేస్తున్నాయి?

– కె.భూమయ్య, విద్యానగర్

నరేశ్ : అనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ)కింద 15 మంది సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసి స్కూళ్లు, జనావాసాల్లో కుక్కల బారినుంచి తమను తాము కాపాడుకునేందుకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే స్టెరిలైజేషన్ చేపడతాం.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు?

– ఎం.రోహిత్, జగిత్యాల

నరేశ్ : దుకాణాలు, కూరగాయల మార్కెట్, చికెన్, మటన్ సెంటర్లలో తరచూ తనిఖీలు చేస్తున్నాం. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్న వారిపై జరిమానా విధిస్తున్నాం.

పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రైనేజీల్లో పూడిక తీయడంలేదు?

–కె.సత్యనారాయణ, విజయపురి

రమేశ్ : సిబ్బంది కొరత ఉన్నా బల్దియాలో నిత్యం పారిశుధ్య పనులు చేపడుతున్నాం.

నల్లగుట్ట డంపింగ్‌యార్డుతో సమస్యలు తలెత్తుతున్నాయి?

– జి.మనోహర్, విద్యానగర్

రమేశ్ : డింపింగ్‌యార్డును నూకపల్లి సమీపంలో ఏర్పాటు చేస్తాం.

మిషన్ భగీరథ పైపులైన్లు అనుసంధానించక మంచినీటి సరఫరా జరగడంలేదు?

–కె.రాజశేఖర్, ఉప్పరిపేట

రమేశ్ : మున్సిపాలిటీలో తాగునీటి సమస్య లేదు. లీకేజీలున్న చోట మరమ్మతు చేపడతాం. మరికొన్నిచోట్ల మిషన్ భగీరథ పైపులు అనుసంధానించే ప్రక్రియ సాగుతోంది.

తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన లోపిస్తోంది.

–జి.కిరణ్‌కుమార్, అశోక్‌నగర్

రమేశ్ : ప్రస్తుతం పట్టణంలో బయో మైనింగ్ ప్రక్రియ చేపట్టాం. ప్రజలు బాధ్యతగా తడి, పొడి చెత్త వేర్వేరుగా సిబ్బందికి ఇవ్వాలి.

కుక్కలు కరుస్తున్నాయి?

–వి. రాజేందర్, కృష్ణానగర్

రమేశ్ : వార్డుల్లోని వీధికుక్కలకు ఇబ్బందులు కలిగించొద్దు. వాటి జోలికి వెళ్తేనే కరుస్తాయి. జాగ్రత్తగా ఉండాలి.

ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి?

– సీహెచ్.కల్యాణ్, కృష్ణానగర్

రమేశ్ : ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీచేశాం. పందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

చాలాచోట్ల వీధిలైట్లు వెలగడం లేదు?

–కె.సుభాష్, కృష్ణానగర్

రమేశ్ : వీధి దీపాల నిర్వహణ బాధ్యతల్ని ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. అయినా, సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రధాన మార్గాల్లో సంచరించే ఆవులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి?

– ఎస్.సుధాకర్, పోచమ్మవాడ

రమేశ్ : యజమానులు వదిలేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఆటంకం కలిగిస్తున్న ఆవులను తాటిపల్లి గోశాలకు తరలించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

బీదర్ దొంగల పనే!

- కొండగట్టు ఆలయ చోరీ కేసులో పురోగతి
- 24 గంటల్లోనే నిందితులను గుర్తించిన పోలీసులు
- సెల్‌టవర్ డంప్ ఆధారంగా ముగ్గురి నంబర్లు గుర్తింపు
- చోరీ అనంతరం కర్ణాటక పారిపోయిన దొంగలు
- పట్టుకువచ్చేందుకు కర్ణాటక వెళ్లిన ప్రత్యేక బృందం
- పొరుగురాష్ట్రం దొంగలని ముందే వెల్లడించిన 'సాక్షి'



సీసీ ఫుటేజీల్లో రికార్డయిన దొంగల కదలికలు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా కొండగట్టు చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఆలయంలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలను కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందినవారిగా చోరీ జరిగిన ప్రాంతంలో లభించిన సీసీ ఫుటేజీ, సెల్‌టవర్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా గుర్తించారు. ఇటీవలే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా పర్యటించి ఆలయాభివృద్ధికి రూ.600 కోట్లు ప్రకటించిన నేపథ్యంలో చోరీ జరగడం సంచలనం రేపింది. రాష్ట్రమంతా కొండగట్టు పుణ్యక్షేత్రంపై చర్చిస్తున్న నేపథ్యంలో ప్రధానాలయంలో చోరీ జరగడంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 24 గంటల్లోనే నిందితులను గుర్తించారు.

మధ్యాహ్నానికి కొలిక్కి వచ్చిన కేసు

సీఎం పర్యటించిన వారంరోజుల్లోనే ఆలయంలో చోరీ జరగడంపై పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి మధ్యాహ్నానికి కేసులో కీలక పురోగతి సాధించారు. ఆలయంలో దొంగతనం చేసింది కర్ణాటకకు చెందిన ముఠాగా గుర్తించారు. దొంగలు 24వతేదీ శుక్రవారం తెల్లవారుజామున 1.20 గంటల తరువాత భేతాళ గుడి పక్క నుంచి ప్రధానాలయం వెనక తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. లోనికి వచ్చే సమయంలో జనాల దృష్టి మరల్చేందుకు సెక్యూరిటీ దుస్తులు, చేతిలో లాఠీ, ఒంటిపై కొత్త పసుపు శాలువా కప్పుకుని వచ్చారు. శాలువాలో చోరీ చేసేందుకు వీలైన పనిముట్లు తీసుకొచ్చారు. ఉదయం 1.20నిమిషాల నుంచి ఉదయం 4 గంటల మధ్యలో దొంగతనం జరిగింది. ఈ మధ్యకాలంలో కొండగట్టుపై యాక్టివ్‌గా ఫోన్ నంబర్ల డేటాను పోలీసులు సేకరించారు.

కర్ణాటకకు బయల్దేరిన పోలీసులు

అందులో కొన్ని నంబర్లు కర్ణాటకకు చెందినవి. అనుమానాస్పదంగా కనిపించిన ఈ నంబర్లకు సంబంధించిన మరిన్ని వివరాలు సేకరించేందుకు కొండగట్టుపై సెల్‌ఫోన్ సేవలు అందించే సెల్‌టవర్ల నుంచి డంప్ (కాల్స్ వివరాలు) మొత్తం జల్లెడ పట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన నంబర్లు కర్ణాటకకు చెంది ఉండటం, చోరీకి ముందు తరువాత అక్కడ నుంచి మాయమవడంతో పోలీసులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించారు. అనుమానాస్పద నంబర్ల చిరునామాలు, వీటి సీడీఆర్ (కాల్ డేటా రికార్డు)ను కూడా సంగ్రహించారు. ఆ నంబర్ల కాల్స్ కర్ణాటకకు చెందిన నంబర్లతో కనెక్ట్ అయి ఉన్నట్లు హిస్టరీ తేలడంతో మరింత లోతుగా అన్వేషించారు. దీంతో అవే నెంబర్లు మెట్‌పల్లి, కామారెడ్డిల మీదుగా బీదర్ వరకు ఆయా సెల్‌టవర్ల లొకేషన్లతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలు కూడా కీలక ఆధారాలుగా మారాయని తెలిసింది. దీంతో నిందితులు బీదర్ జిల్లాకు చెందిన దొంగలుగా నిర్ధరణకు వచ్చారు. వెంటనే బీదర్ పోలీసులకు సమాచారం ఇచ్చి రెండు ప్రత్యేక బృందాలు కర్ణాటకకు బయల్దేరాయి.

దొంగలను పట్టుకున్న పోలీసులు..?

ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పోలీసు బృందం కర్ణాటకకు వెళ్లింది. దొంగలు అక్కడికి వస్తారని అనుకున్న పోలీసులకు శుక్రవారం రాత్రి నిరాశే ఎదురైనట్లు సమాచారం. శనివారం సాయంత్రం ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన వారిలో ఒకరు దొరికినట్లు సమాచారం. నిందితులను పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతున్నా.. ఈ విషయాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. ఆదివారం లేదా సోమవారం దొంగలను తెలంగాణకు తీసుకువచ్చి, ప్రెస్‌మీట్ నిర్వహించే అవకాశాలున్నాయని తెలిసింది. పోలీసులు విడుదల చేసిన సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దొంగలు మహారాష్ట్ర లేదా పొరుగు రాష్ట్రం వారి అయి ఉంటారని 'సాక్షి' ముందే వెల్లడించిన విషయం తెలిసిందే.

నైట్‌వాచ్‌మన్‌పై సస్పెన్షన్ వేటు

- ఇద్దరు ఆలయ ఉద్యోగులు, నలుగురు హోంగార్డులకు మెమోలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువ జామున చోరీ జరిగేందుకు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యమే కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈమేరకు నైట్‌వాచ్‌మన్ శంకర్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో వెంకటేశ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, హుండీ కీపర్ చంద్రమౌళి, హోంగార్డులు కొండ రమేశ్, కొడిమ్యాల రమేశ్, రాజేశ్, అంజయ్యకు మెమోలు జారీచేశారు. వీరు విధుల్లో నిర్లక్ష్యం వహించారని, నిర్దేశిత సమయంలోగా సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను వదిలేసి చిరుద్యోగులపై వేటు వేయడం ఏమిటనే చర్చ సాగుతోంది.

ఆలయాల భద్రత అగమ్యగోచరం

- ఆదాయంపైనే అధికారుల దృష్టి
- సీసీ కెమెరాలు, సెక్యూరిటీపై నిర్లక్ష్యం
- కొండగట్టు చోరీ ఘటనతో మేలుకున్న దేవాదాయ శాఖ



సీసీకెమెరాలు లేని మల్లాపూర్ మండలంలోని శ్రీకనకసోమేశ్వరస్వామి ఆలయం

జగిత్యాలక్రైం: జిల్లాలోని ఆలయాల భద్రత అగమ్యగోచరంగా తయారైంది. అనేకమంది భక్తులతో ఎప్పుడు రద్దీగా ఉండే కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలోనే దొంగలు భారీ చోరీకి పాల్పడడం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధీనంలోని ఆలయాల్లో భద్రతా లోపాలను ప్రశ్నిస్తోంది.

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఇవే..

కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి, వెల్గటూర్ కోటిలింగాల కోటేశ్వరస్వామి, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి, సారంగాపూర్ శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి, మల్లాపూర్ శ్రీ కనకసోమేశ్వరస్వామి, వాల్గొండ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాలు ప్రఖ్యాతి గాంచాయి. వీటితో పాటు రాయికల్ కొత్తపేట నాగాలయం, కోరుట్ల సాయిబాబా, మెట్‌పల్లిలోని గండిహనుమాన్, గొల్లపల్లి మండలం మల్లన్నపేట శ్రీ మల్లికార్జునస్వామి, రాపల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి, చిల్వాకోడూర్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి, వెన్గుమట్ల గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి తదితర ఆలయాలూ భక్తులతో తరచూ రద్దీగా ఉంటాయి.

దేవునికే భద్రత కరువు..

- కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో 48 సీసీ కెమెరాలు ఉండగా అందులో 38 మాత్రమే పనిచేస్తున్నాయి.
- ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో 35 సీసీకెమెరాలు ఉన్నాయి. ముగ్గురు సెక్యూరిటీ గార్డులు రాత్రివేళల విధులు నిర్వహిస్తున్నారు.
- కోరుట్ల సాయిబాబా దేవాలయంలో 9 సీసీ కెమెరాలు ఉండగా ముగ్గురు సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం ఇక్కడ హుండీ చోరీకి గురైంది.
- మల్లాపూర్ మండలంలోని నాలుగు ఆలయాల్లో సీసీ కెమెరాలు లేవు.
- సారంగాపూర్ మండలం పెంబట్ల శ్రీదుబ్బరాజేశ్వరస్వామి ఆలయంలో 12 సీసీ కెమెరాలు ఉండగా, మూడు పనిచేయడం లేదు. ఒక వాచ్‌మెన్‌తోపాటు ఒక సెక్యూరిటీ గార్డు రాత్రివేళ పనిచేస్తున్నాడు.
- బీర్‌పూర్ అటవీప్రాంతంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఇటీవల 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇద్దరు వాచ్‌మెన్‌లను నియమించారు.
- వెల్గటూర్ మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వరస్వామి ఆలయంలో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక వాచ్‌మెన్‌ను నియమించారు.
- గొల్లపల్లి మండలంలోని నాలుగు ఆలయాల్లో ఎక్కడా సెక్యూరిటీలేదు.

అధికారుల అప్రమత్తం

కొండగట్టు పుణ్యక్షేత్రంలో శుక్రవారం వేకువజామున జరిగిన భారీచోరీతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధీనంలోని ఆలయాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అన్ని ఆలయాల్లో సత్వరమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రాత్రి వేళ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను నియమించాలని ఆదేశాలు జారీచేశారు.

విలువైన వస్తువులకు భద్రత

జిల్లాలోని వివిధ ఆలయాల్లో విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో నిల్వచేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉత్సవ సమయాల్లోనే వీటిని తీసుకొచ్చి వినియోగించాలని, ఆ తర్వాత భద్రపర్చుకోవాలని సూచించారు. మరోవైపు.. గ్రామాల్లోని ఆలయాల్లో కూడా కమిటీలు, నిర్వాహకులు విలువైన వస్తువులను భద్రపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

నిఘా పటిష్టం చేశాం

ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో 35 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరిసరాల్లో నిఘా పటిష్టం చేశాం. రాత్రివేళ ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులను నియమించాం. భద్రత మరింత పెంచేందుకు పోలీసుల సాయం కోరాం.

– శ్రీనివాస్, ఈవో, ధర్మపురి

ఆలయాలకు భద్రత కట్టుదిట్టం



జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో భద్రత పటిష్టం చేస్తున్నాం. దేవాదాయ శాఖ అధికారులు కూడా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలి. సెక్యూరిటీ పెంచాలి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చాం.

– భాస్కర్, ఎస్పీ

సమస్యలు చెప్పండి.. పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- కోనాపూర్‌లో పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్(జగిత్యాల): 'మీకు ఏమైనా సమస్యలు ఉంటే నాతో చెప్పండి.. ఓ అన్నలా, ఓ కొడుకులా, ఓ తమ్ముడిలా వాటిని పరిష్కరిస్తా' అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మీరు–నేను కార్యక్రమంలో శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కోనాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అర్హత ఉండి అందని వారు ఎవరైనా ఉంటే నాతో చెప్పండి, వీటిని పరిష్కరించడానికి కృషిచేస్తా అని అన్నారు. స్థానికుల ఇళ్లలోకి వెళ్లి పలుకరించారు. రైతువేదికలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. అనంతరం పల్లెనిద్ర చేశారు. ఆదివారం ఉదయం కోనాపూర్, పెంబట్ల, పోచంపేట గ్రామాల్లో ఆయన పర్యటించనున్నారు. ఆయన వెంట ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి తోడేటి శేఖర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కోల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి(చొప్పదండి): అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని, వీటి కోసం రూ.వేల కోట్లు వెచ్చించేందుకు సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పలు గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన వివిధ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులతో కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మార్గనిర్దేశంలో ధర్మపురి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం నిధులు మంజూరు చేయించామన్నారు. త్వరలో నందగిరి గ్రామస్తుల తాగునీటి కొరత తీర్చుతామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పక్కా భవనాలు నిర్మిస్తామని, ఇందుకోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రమణారావు, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, మల్లారెడ్డి, వెంకన్న, రాజేందర్‌రావు, శోభ, గంగాధర్ పాల్గొన్నారు.

దేశానికే దిక్సూచి

మల్యాల(చొప్పదండి): విద్య, వైద్యం, నీటిపారుదల, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే దిక్సూచి మారిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి మల్యాల మండలంలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లింక్ కెనాల్ నుంచి కొండగట్టుకు నీరు తరలించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలిపారు. నాయకులు రాంమోహన్‌రావు, నరేందర్‌రెడ్డి, ఎడిపెల్లి అశోక్, మిట్టపల్లి సుదర్శన్, రమణారావు, సాగర్‌రావు ఉన్నారు.

సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా..

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పట్టణంలో రూ.4.67కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి మంత్రి ప్రారంభించారు. పలు పనులకు శంకుస్థాపన చేశారు.

క్లుప్తంగా

కేసీఆర్ మోసపూరిత మాటలు నమ్మొద్దు

- బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ

కోరుట్లరూరల్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మోసపూరిత మాటలను ప్రజలు నమ్మవద్దని బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ అన్నారు. యూసుఫ్‌నగర్ గ్రామంలో శనివారం ప్రజాగోస బీజేపీ.. భరోసా యాత్ర మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తుల ఉమ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో అనేక పథకాలను సామాన్యులకు ప్రయోజనం చేకూరేలా ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా, బీమా పథకాలు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలిచ్చి వాటిని నెరవేర్చటంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్, నాయకులు సురభి నవీన్‌కుమార్, భూమానందం, యాద గిరిబాబు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్లీనరీకి సుజిత్‌రావు



సమావేశంలో సుజిత్‌రావు

మెట్‌పల్లి: రాయ్‌పూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ ప్లీనరీలో కోరుట్ల నియోజకవర్గం నుంచి ఆ పార్టీ నాయకుడు కల్వకుంట్ల సుజిత్‌రావు తరలివెళ్లారు. పీసీసీ డెలిగేట్‌గా వ్యవహరిస్తున్న ఆయన.. తొలిసారిగా ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈ అవకాశం రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మద్యం తాగి.. హాస్టల్‌లోకి వెళ్లి..!

- విద్యార్థినులను ఇంటర్వ్యూ చేసిన ఉద్యోగి!
- భయకంపితులైన బాలికలు
- విచారణకు ఆదేశించిన ప్రిన్సిపాల్



జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏం జరుగుతోంది? జిల్లా కేంద్రం కావడం, ఇటీవల మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడం, ఈఏడాదే 150 మంది మెడికో విద్యార్థులతో తరగతులు ప్రారంభం కావడం వైద్యరంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టినట్లయ్యింది. అయితే, రెండు రోజుల క్రితం మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మద్యం తాగి బాలికల హాస్టల్‌కు వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అక్కడకు వెళ్లి.. విద్యార్థులను క్యూపద్ధతిలో నిలబెట్టి వివిధ అంశాలపై ఇంటర్వ్యూ చేసినట్లు సమాచారం. అంతేకాదు.. పలు ప్రశ్నలు వేస్తూ ఇబ్బందులు పెట్టినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం.. ఒక బాలికల హాస్టల్‌కు ఎవరూ వెళ్లకూడదు. వైద్య కళాశాలల్లో ర్యాగింగ్‌తో విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం, ఆత్మహత్యలకు యత్నించడం కొద్దిరోజులుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఈ సంఘటన చోటుచేసుకోవడంతో చర్చనీయాంశంగా మారింది.

ఆలస్యంగా వెలుగులోకి...

మద్యం తాగి ఓ ఉద్యోగి హాస్టల్‌లోకి వెళ్లి హల్‌చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ అధికారి వచ్చి తమను వివిధ విషయాల గురించి అడిగారని పలువురు మెడికోలు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. అయితే, ఇట్లాంటి పరిస్థితుల్లో తాము వసతి గృహంలో ఉండే పరిస్థితి లేదని బాధితులు వాపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్.. సదరు ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

విచారణకు ఆదేశం..

వసతి గృహంలో ఏం జరిగిందన్న విషయంపై ప్రిన్సిపాల్ శివరామకృష్ణ.. ఇద్దరు డాక్టర్లతో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. సదరు ఉద్యోగి బాలికల హాస్టల్‌కు ఎందుకు వెళ్లారని, బాలిక హాస్టల్‌కు వెళ్లే నిబంధనలు లేవని పేర్కొన్నారని తెలిసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఆ ఇద్దరు డాక్టర్లు సైతం పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసినట్లు సమాచారం.

ఉన్నతాధికారుల అండతోనే..

మెడికల్ కాలేజీలోని ఓ ఉన్నతాధికారి అండదండలతోనే సదరు ఉద్యోగి ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలేజీ ఆవరణలో చేపట్టిన భవన నిర్మాణ పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అన్ని విషయాలూ బయటపడే అవకాశాలున్నాయి.

విచారణ చేపట్టాం

ఉద్యోగి బాలికల వసతి గృహానికి వెళ్లడం పొరాటే. ఆపై మద్యం తాగినట్లు తెలిసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. ఇందుకోసం ఇద్దరు డాక్టర్లతో కూడిన కమిటీ ఏర్పాటు వేశాం. నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం.

– శివరామకృష్ణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

కొండగట్టుకు భక్తుల తాకిడి



ఆలయంలో హనుమాన్ స్వాములు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ అంజనేయ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. హనుమాన్ జయంతి సమీపిస్తుండడంతో ఇప్పటికే రద్దీ ఉంటోంది. అయితే, ఆలయంలో ఇప్పటికీ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఎండకు అనేక అవస్థలు పడుతున్నారు. షెడ్లపై రేకులు లేవు. ఆలయ ఆవరణలో మ్యాట్లు లేవు. హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాముల తాకిడి పెరిగింది. శనివారం కొండకు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన భక్తులు.. మ్యాట్లు లేవని, తాగునీరు లేదని, స్వామివారి దర్శనం పైరవీకారులకు ఒకరకంగా, సాధారణ భక్తులకు మరోరకం కల్పిస్తారని ఆరోపించారు. సుమారు నాలుగు గంటలపాటు చిన్నపిల్లలు, ముసలివారు ఎండలో నిల్చుంటే బాధ ఎలా ఉంటుందో తెలుస్తుందని వారు అన్నారు. అధికారుల తీరుపై వారు తీవ్రంగా మండిపడ్డారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను చూపిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

ధర్మపురి/వెల్గటూర్: బ్రాండిషాపులు, ఆలయాల్లో వరుస చోరీలు చేసిన కేసుల్లో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 21న అర్ధరాత్రి వెల్గటూర్‌లోని మహాలక్ష్మి వైన్స్‌లో కాపలాదారును చితకబాది రూ.10వేల నగదు, 10 మద్యం బాటిళ్లు దొంగలు అపహరించారు. ఈనెల 23న ధర్మపురి మండలం రాయపట్నం గోదావరి తీరంలోని శివాలయం హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసులకు సవాలుగా మారిన వరుస చోరీలపై ఎస్పీ భాస్కర్ తీవ్రంగా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం వెల్గటూర్ మండలంలోని స్తంభంపెల్లి శివారు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు ప్రశ్నించగా.. జగిత్యాలకు చెందిన గందం నరేశ్, కరీంనగర్‌లోని రేకుర్తికి చెందిన తూర్పాటి మైసయ్యతోపాటు మరో మైనర్ చోరీలకు పాల్పడినట్లు తేలింది. ప్రధాన నిందితుడు.. లక్సెట్టిపేటకు చెందిన పత్తి కనకయ్య పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రెండు టీవీఎస్ మోపెడ్లు, రూ.3 వేలు నగదు, ఒక ఇనుపరాడ్, నాలుగు విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్లలో సుమారు 15 కేసులు నమోదై ఉన్నాయి. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఇటీవల కొండగట్టు, పొలాస దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు రమేశ్, లింగారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ.60.17 కోట్లు

- ఆమోదించిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.60.17 కోట్ల బడ్జెట్‌ను ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, ప్రజల మౌలిక సదుపాయల కల్పనలో భాగంగా పెండింగ్‌లోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని అన్నారు. కుక్కల బెడదను నివారించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని, వాటికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన పేదల్లో 3,355 మందిని అర్హులుగా గుర్తించామని తెలిపారు. త్వరలోనే జాబితా ప్రకటిస్తామని అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. ఆసరా పింఛన్ల ద్వారా అర్హులైన 17,259 మంది లబ్ధిదారులకు ఏడాదికి రూ.43.35 కోట్లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నామని చెప్పారు. కేవలం అంకెలతో బడ్జెట్‌ను చూపించారని, కానీ ఆచరణలో అమలు కావడం లేదని, పారిశుధ్యంపై ఎక్కువగా దృష్టి పెట్టాలని, కానీ నిధులు తగ్గించారని, రైజనార్ అమలు చేయాలని ఎన్నిసార్లు సూచించినా దాటవేస్తున్నారని కౌన్సిలర్ అనుమల్ల కృష్ణహరి విమర్శించారు. గత సంవత్సరం బడ్జెట్ కన్నా ఈసారి తగ్గించారని మరో కౌన్సిలర్ జయశ్రీ ఆరోపించారు. ప్రతిపక్ష వార్డు సభ్యులపై పక్షపాతం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బోనగిరి నరేశ్, డీఈ రాజేశ్వర్, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత

కొండగట్టు(చొప్పదండి): అంజన్న దర్శనం కోసం శనివారం వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన భాసంశెట్టి వెంకటలక్ష్మి.. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ఆవరణలో సేదదీరి ఆ తర్వాత బ్యాగ్ మర్చిపోయింది. ఈ విషయాన్ని పోలీస్ చెక్‌పోస్ట్‌లోని సిబ్బంది దృష్టికి తీసుకెళ్లింది. వారు హ్యాండ్‌బ్యాగ్ గుర్తించి భక్తురాలికి అప్పగించారు. అందులో 2తులాల బంగారు చైన్, ఫోన్, రూ.7,311 నగదు ఉంది.

హామీలను విస్మరించారు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు



మాట్లాడుతున్న సత్యనారాయణరావు

జగిత్యాల: తెలంగాణలో అధికార బీఆర్ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఎన్నికలు వస్తేనే అభివృద్ధి గుర్తుకొస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు విమర్శించారు. స్థానిక అన్నపూర్ణ చౌరస్తాలో బీజేపీ ఇన్‌చార్జిలు ఠాకూర్ పవన్‌సింగ్, రవితేజ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి విస్మరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఆయుష్మాన్ భారత్ ప్రవేశపెడితే.. తెలంగాణలో అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. పట్టణంలో రోడ్లన్నీ గుంతలుగా మారాయని, కనీసం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. యావర్‌రోడ్డు విస్తరణ ఎన్నికల హామీకే పరిమితమైందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించి ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యం, కన్వీనర్ మదన్‌మోహన్, నాయకులు తిరుపతి, పొన్నాల తిరుపతిరెడ్డి, వీరబత్తిని అనిల్, రాజు, ఆముదరాజు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జగిత్యాలరూరల్: కేంద్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు కోరారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రజాగోస.. బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం గ్రామ అధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, శైలేందర్‌రెడ్డి, చిలుకమర్రి మదన్‌మోహన్, రాగిల్ల సత్యనారాయణ, నలువాల తిరుపతి పాల్గొన్నారు.

కరెంటోళ్లు కనికరిస్తలేరు..


- విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మహిళ నిరసన
- పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న లక్ష్మి

మల్లాపూర్(కోరుట్ల): కరెంటోళ్లు కనికరిస్తలేరని ఓ మహిళ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన కొత్తదాంరాజుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. ఏలేటి లక్ష్మికి కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఆమె ఇంటిపై నుంచే 11కేవీ కరెంట్ తీగలు వెళ్తున్నాయి. వాటితో ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ముఖ్యంగా వర్షకాలంలో ఇంట్లో విద్యుత్ ప్రసరిస్తోంది. విద్యుత్ తీగలు తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. సొంతంగా డబ్బు వెచ్చిస్తేనే వాటిని తొలగిస్తామని నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. ఇక తన ప్రాణాలు పోతేనే విద్యుత్ అధికారులు స్పందిస్తారని భావించిన లక్ష్మి.. పురుగుల మందు డబ్బా పట్టుకుని కరెంట్ సబ్‌స్టేషన్ వద్దకు చేరింది. పురుగుల మందు తాగుతానని హెచ్చరించింది. స్పందించిన సిబ్బంది.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వారితోపాటు స్థానికులు సముదాయించడంతో ఏలేటి లక్ష్మి ఆందోళన విరమించింది.

అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలపై పరిశోధనలు



జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: అధిక దిగుబడులు ఇచ్చే, పురుగులు, తెగుళ్లను తట్టుకునే విత్తనాలపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగదీశ్వర్ అన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు చేపట్టిన పరిశోధనలను జగదీశ్వర్ శనివారం పరిశీలించారు. ఈనెలాఖరులో జగదీశ్వర్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన పరిశోధనలకు పెద్దపేట వేయాలన్నారు. పరిశోధనల ఫలితాలు చేనుల్లోకి వెళ్లినప్పుడే పేరు, శాస్త్రవేత్తలకు గౌరవం దక్కుతుందని చెప్పారు. రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానాలు దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాయని, అదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, మన ప్రాంతానికి అనువుగా వాటిని అన్వయించుకుంటూ ముందుకు సాగాలని కోరారు. పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.